N 1162

# ధర్మహాని

●

జగత్తులో ధర్మం అంటూ ఒక టున్నది. కుటుంబంలో ప్రతి వ్యక్తికీ కొన్ని బాధ్యతలూ, హక్కులూ వున్నాయి. రెక్కలు వచ్చేంత వరకు కొడుకును తండ్రి పోషిస్తాడు. అడిగే హక్కు కొడుకుది; ఇచ్చే బాధ్యత తండ్రిది. ఇదీ ధర్మం. ఈ ధర్మం తలక్రిందులు కావడం ఎంత విచిత్రం!

ప్రేమానందానికి ఆ సాయంకాలంపూట ఆనందం లోపించింది....

ఆనందించడం అతని తత్వం. అతనికి ఆనందాన్ని ప్రసాదించే వస్తువు 'ప్రేమ'. తన ముప్పైఅయిదేళ్ళ జీవితంలో ప్రేమానందం తన ఆనందంకోసం ఆ ప్రేమను అనేక వస్తువులమీద ప్రయోగించాడు. అతడు బాల్యంలో ఆహారాన్ని ప్రేమించాడు; యౌవనంలో భార్యను ప్రేమించాడు. ఒక కొడుకు పుట్టి వాడు పదేళ్ళవాడై, దాంపత్యం మీద అనురక్తి తగ్గినతర్వాత—అతని ప్రేమ మరీ ఇనుమడించింది. ఆ ప్రేమ ధూమపానం పైన దృఢపడింది.

విధాత తనకు పేరు మంచిది వ్రాసిపంపాడు గానీ- ఆ నుదుటి వ్రాతనుమాత్రం సరిగ్గా వ్రాసిపంపక పోయాడని- ప్రేమానందానికి విధిమీద కక్ష. విధి తనకు ఆ ఒక్క ద్రోహం చేయకుండా వుండి ఉంటే - అతడు ధూమపానాన్ని మరింత బాగా ప్రేమించేవాడు. అంటే మరింత బాగా ఆనందించేవాడన్నమాట!...పచ్చకాగితాలు పొగచేసి త్రాగేవాడేమో!...విధి అనుకూలించలేదు గనుక నే- తాను బీడీలతో తృప్తిపడవలసి వచ్చింది.

ప్రేమానందం ఎక్కువ చదువుకోలేదు. కనీసం మాధ్యమిక పాఠశాలనైనా దాటుకోలేకపోయాడు. చదువుకోకపోయినందుకు అతడు చాలాకాలం తర్వాత, ఈ నాటికీ చాలాసార్లు చింతించాడు. కాని - ఆ చింతించేతీరికమాత్రం

వేరు... తనకు ముందుచూపు లేకపోయింది. చదువుకున్నా స్తే చెప్పాడు. బుద్ధిగా చదువుకొని, ఏస్కూలుఫైనలో ప్యాసయి వుంటే - తానూ ఈ నాటికి ఒక గుమాస్తాగానైనా ఉండ గలిగేవాడు. అప్పుడు సిగరెట్లు కాకపోయినా రోజుకు రెండు కట్టలబీడీలైనా కాల్చేసేవాడు. బీడీలకోసం తడుపులాడుకు నే దురదృష్టయోగం తనకు పట్టేదికాదు. ఈ బంట్రోతు బ్రతుకులో ఆయోగం తనను పొంచి పొంచి పట్టుకుంటోంది.

అతని జేబులో ఇప్పుడు ఒక్క బీడీముక్కైనా లేదు. అది లేకపోతేపోయింది; అయ్యో హాతవిధీ! ఆ జేబులోనే ఒక్క కానీ అయినా వుండరాదా?...

జీతాలు కలియుగంలో వస్తాయి. ఈ రాత్రి కృత యుగం! రేపు త్రేతాయుగం! ఎల్లుండి ద్వాపయుగం!... ఆ మరునాడే కలియుగం!... అంతవరకు జేబులో కానీ ఉండదు.

పగలు-ప్రేమానందంలా నిర్జీవమైపోయింది. చీకటి క్రమ్ముకొంది. ప్రేమానందం భార్య రాజ్యమ్మ దీపం వెలిగించింది. దీపం వెలుగులో అతని కొడుకు గోపీ - ఎక్కడ సంపాదించాడో-పిల్లల కథల పత్రిక తిరగేసుకుంటున్నాడు. రాజమ్మ కంచాలు కడుక్కుంటోంది. ప్రేమానందం బీడీ నామస్మరణ చేస్తూ, జడపదార్థంలా చలనరహితంగా కూర్చున్నాడు. అతనికి పిచ్చెక్కినట్లుంది.

గోపీ ఉన్నట్టుండి విరగబడి నవ్వాడు. వాడు చదువుతున్న పత్రికలో ఒకతమాషా కనిపించింది. "ఒరే! దేవుడు మనకు చెవులెందుకు ఇచ్చాడురా?" అని పంతులు ఒక

విద్యార్థిని ప్రశ్నించాడు. అందు కా విద్యార్థి— "బీడీ ముక్కలు ఆర్పి పెట్టుకోడానికి మేష్టారూ!" అని జవాబిచ్చాడు. ఈ తమాషా గోపీని నవ్వించింది. వాడు నవ్వుతూనే దాన్ని తండ్రికికూడా వినిపించాడు. కాని—అది ప్రేమానందాన్ని నవ్వించలేకపోయింది. ఆ విద్యార్థి జవాబులో అసమంజసమేమీ కనిపించలేదతనికి. "చెవులు వినడానికి" అనేదే జవాబైవుంటే అతను నవ్వేవాడేమో!...

రాజమ్మ అన్నానికి లేచిరమ్మంది. తండ్రీకొడుకు లిద్దరూ అన్నం ముందు కూర్చున్నారు.

"నాన్నా! నాకో అణా ఇవ్వు! ఈ రాత్రి పుష్పపల్లకి మెరవణి!" అన్నాడు గోపీ. తాను కొడుకు గనుక ప్రేమానందం తండ్రిగనుక వాడు ధైర్యంగా అడిగాడు.

ప్రేమానందం మాట్లాడలేదు. గోపీ మళ్ళీ రెట్టించాడు—

"చిల్లర లేకపోయినా సరేలే! నేను మార్చుకొస్తానుగా!"

ప్రేమానందం ఇంతవరకు తాపంలో ఉన్నాడు. ఇప్పుడుదానికి కోపంకూడా తోడైంది. "నా దగ్గర అణాకానీ లేదురా!" అన్నాడు కోపంగా.

"అణాకాని దేనికి? అణాచాల్లే!" అన్నాడు గోపీ.

ప్రేమానందం చేయి కడుక్కుంటూ - "నాకూ కావాలి ఒక కానీ!" అన్నాడు. గోపీ అణా కావాలని మొండికేశాడు. ప్రేమానందానికి అరికాలిమంట నెత్తికెక్కింది. అతడు గోపీని తన్నబోయాడు. శాంతమూ, ఓపికా గోపీని

రక్షించబోయాయి. ప్రేమానందం ముందు ఆరెంటినీ తన్ని తగిలేసి, తర్వాత తనపని కానిచ్చాడు. గోపీ ఏడుస్తూ, లాగు పైకిలాక్కుంటూ వీధిలోకి వెళ్ళిపోయాడు.

కోపంచల్లారాక—"ఓసేయ్ రాజీ!" అన్నాడు ప్రేమానందం—బీడీమీది ప్రేమనంతా పెళ్ళాంమీద ఒలకబోస్తూ.

"ఏం రాజా?" అంది, ఆమె కొడుకును కొట్టాడన్న అలుక భావంతో.

"నీదగ్గర ఒక టేకాసీ, లేదా రెండే నయాపైసలు న్నాయా?..." అన్నాడు ప్రేమానందం మూడేయేండ్ల ముద్దు పాపలా.

"నాదగ్గర లేదు..."

"పోనీ, అలమరాలో డబ్బీలో ఏమన్నా ఉందా?"

"అందులో లేదు గనుక నే-పక్కింట్లో అరపడి ఉప్పు అప్పుదీసుకున్నా నివాళ..."

తన్ను తానే అసహ్యించుకున్నాడు ప్రేమానందం. ఈ వెధవ బంట్రోతు జన్మానికన్నా - బీడీఫ్యాక్టరీ ముందు భిక్షగాడిగానైనా పుట్టకపోయాను-అనుకున్నాడు. నిరాశగా నిట్టూర్చి, తన ఆనందాన్ని వెతుక్కుంటూ వీధిలో పడ్డాడు.

* * *

రోజూ ఈ సమయానికంతా ఊరు మాటుమణిగేది. కాని, ఈరోజు ఊరంతా కోలాహలంగా ఉంది. వీధుల్లో సందడి తగ్గలేదు. పిల్లలు ఉత్సాహంగా అటూ ఇటూ పరుగులెడుతున్నారు. దూరంగా ఎక్కడో లౌడ్‌స్పీకరులోంచి

సినిమాపాటలు నిర్విరామంగా వినిపిస్తున్నాయి. రాత్రికి-పుష్పపల్లకి ఊరేగింపు జరుగుతుంది.

రాజమ్మకు మనస్సంతా గోపీమీదే వున్నది. "నిష్కారణంగా దెబ్బలు తినిపోయాడు. ఎక్కడ తిరుగుతూ ఉంటాడో?... ఏదైనా కొనుక్కు తినడానికి వాడిదగ్గర చిల్లరకూడా లేదు-పాపం!..."

సినిమాపాటలు క్రమంగా దగ్గరౌతూ విన్పిస్తున్నాయి. ఇళ్ళలోని జనమంతా వాకిళ్ళల్లో నిలబడ్డారు. రాజమ్మకూడా వాకిట్లోకి వచ్చి నిలబడింది. వీధివివర-గ్రామఫోనుపాటల్ని మోసుకొస్తూ ఏదో వ్యాను కనిపించింది. ఆ వ్యానుకు ముందుగా కొందరు పిల్లలు అట్టముక్కలు చేతబట్టుకొని, కేకలు పెడుతూ వస్తున్నారు.

పిల్లల్ని దురభ్యాసాలకు ప్రోత్సహించే ఉపాధ్యాయులుగానీ, తమ ఉపాధ్యాయుల యెదుట ఆ దురభ్యాసాలను ధైర్యంగా సమర్థించగల విద్యార్థులుగానీ-ప్రపంచంలో ఎక్కడా ఉండకపోవచ్చు. కాని - ఈ బీడీ పారిశ్రామికులు అటువంటి పాత్రలనూ సృష్టించగలరు.

ఆ పిల్లల్లో గురువుకు, శిష్యులకు మధ్య ఈ క్రింది విధంగా సంభాషణ జరుగుతోంది.

"గోపాలా!"

"ఏం సార్!?"

"ఎక్కడికెళ్తున్నావ్?"

"అంగడికెళ్తున్నా!"

"ఏం కొనడానికి?"

"బీడీ కొనడానికి!"

"ఏం బీడీ?"

"...మార్కు బీడీ..."

"గోపాలా!"

... ... ...

ఈవిధంగా కేకలుపెడ్తూ, వారు దగ్గరకు వచ్చారు. రాజమ్మ తన కొడుకును చూచి, అబ్బురపడింది. వాడి నోటి దగ్గర మెగాఫోనువుంది. వాడు ఉపాధ్యాయ గాత్రిధారి! మిగతా పిల్లలచేతుల్లో వెదురు కర్రలకు కట్టివున్న అట్ట ముక్కలున్నాయి. వాటిపైన—"ఎల్లప్పుడూ...మార్కు బీడీలనే వాడుడు" అని వ్రాసివుంది. వాళ్ళు కేకలు పెట్టు కుంటూ ముందుకు సాగిపోయారు.

కనురెప్పపాటులో ఆరిపోతూ, మళ్లీ కనురెప్ప పాటులో వెలుగుతూ, ఆశా నిరాశాల్లా మినుకు మినుకు మంటున్న విద్యుద్దీపతోరణాలతో అలంకరించబడి, నాలుగు వైపులా వర్తకచిహ్నాలతో, బీడీకట్టల వర్ణచిత్రాలతో, ఒకటి రెండు సినిమా తారల ముఖచిత్రాలతో నిండపోయి రంగురంగుల కాంతులతో ఆకర్షణీయంగా వున్న బీడీవాళ్ళ వ్యాను సినిమా పాటలతో, మధ్య మధ్య బీడీప్రకటనలతో చెవులు గింగురులెత్తిస్తూ—ఆ పిల్లల వెనుకే సాగిపోయి, వీధికి మరొకచివరన మలుపు దిరిగింది. రాజమ్మ తనకొడు కుని తలుచుకొని మురిసిపోతూ, ఇంటి లోపలికి వెళ్ళింది.

గంట పదకొండు కావస్తూ ఉండగా, గోపీ ఇంటికి వచ్చాడు. తానొక ప్రయోజకుడైనంత గర్వంతో వాడు జేబులోనుంచి నాలుగు బీడీకట్టలు పైకి తీసి, తల్లికి చూపించాడు. వాడి శ్రమకు ప్రతిఫలంగా ప్రకటనవర్తకులు వాడికి ఆ బీడీకట్ట లిచ్చారు. పిల్లల్ని కూడా ధూమపానానికి ప్రోత్సహించి, తమ వ్యాపారాన్ని పటిష్ఠం చేసుకోవాలని వాళ్ళ ఉద్దేశం గాబోలు!...

వీధులన్నీ తిరిగి వాడు అలసిపోయాడు. నిద్ర భరించడానికి శక్యం గాకుండా పోయింది. అందుకే వాడు నేరుగా ఇంటికి వచ్చేశాడు.

గోపీకి చిన్న పెట్టెవుంది. అందులో వాడి పుస్తకాలు, ఆటవస్తువులు భద్రంగా ఉంచుకుంటాడు. ఆ పెట్టెను తెరచి, ఆ బీడీకట్టల్ని అందులో ఉంచాడు. చాపమీద బోర్లగిలా పడుకుని, వాటికేసి చూస్తూ, నిద్రమత్తులో హాయిగా ఏదో ఆలోచించుకోసాగాడు... తనవద్దనుండి అంగడివాళ్ళు ఈ బీడీలను అసలు వెలకు కొనరు. అణాన్నర చొప్పున అమ్మినా నాలుగు కట్టలకు ఆరణాలు రాకపోదు. తెల్లవారగానే చేతిలో ఆరణాలు...ఆ ఆరణాల పునాదుల పైన తీయని కలలు నిర్మించుకుంటూ వాడు మైమరచి నిద్రపోయాడు.

అర్ధరాత్రివేళ ప్రేమానందం హతాశుడై ఇంటికి తిరిగివచ్చాడు. అతని సమస్య ఒక్క బీడీ! ఆ సమస్య పరిష్కారమే కాలేదు. చెప్పుకుంటే సిగ్గుచేటు; ఒకడు ఖాళీ జేబులు తిరగవేసి చూపాడు, మరొకడు—"ఇదిగో! ఒకే

బీడీని మూడోసారి కాలుస్తున్నాను..." అన్నాడు. ఒక అంగడిలో అప్పు అడిగితే—వ్యాపారంలో ఊపిరాడక సత మతమౌతూన్న అంగడివాడు "లేదు పొ"మ్మంటూ కసురు కున్నాడు. "ఛీ! జీవించడం బుద్ధితక్కువ పని!" అనుకు న్నాడు ప్రేమానందం.

అతడు ఇంట్లో కాలు మోపగానే ఒక్కసారిగా దిగ్భ్రాంతుడయ్యాడు. సన్నగా మినుకుమినుకు మంటున్న లాంతరు వెలుగులో—తెరువబడివున్న గోపీ పెట్టె కనిపిం చింది. ఆ పెట్టెలోని బీడీలు అతని కళ్ళకు—ఆకలిగొన్న వాడికి అన్నంలా, శోభనంనాటి పెళ్ళాంలా కనిపించాయి. ఆనందం పెట్టెలోనుండి ఒక్కసారిగా పైకెగిరి అతణ్ణి కౌగ లించుకొంది.

*　　　*　　　*

తెల్లవారగానే గోపీ కలల్లోంచి మేలుకున్నాడు. తన పునాదులకోసం తేరిపారజూచుకున్నాడు. అతని పునాదులు మాయమైనాయి. పెట్టెలో బీడీ కట్టలు లేవు. వాడికి ఏడు పొచ్చింది. "నా బీడీలోయ్!" అంటూ గట్టిగా ఏడుస్తూ కాళ్ళు విలవిల లాడించాడు.

బీడీ దేవతను ఆరాధిస్తూ, "ఆహా! ఎంత హాయిగా వుంది—ఈ ఉషోదయం!..." అనుకుంటూ, ఉత్సాహాన్ని తన హృదయంనిండా అలదుకొంటూ వున్న ప్రేమానందా నికి కొడుకు ఏడుపు వినిపించింది... "పోని ఊరుకోరా! బీడీలు నీకెందుకు? జీతంరాగానే జ్ఞాపకంచెయ్... సినిమాకెళ్దాం..." అనే శాసు తేల్గా.

అతని మాటలు వినగానే గోపీ ఏడుపు తక్కున ఆగి పోయింది. వాడిముఖం క్రమక్రమంగా వికసించి, గంగాళ మంతైంది. అందును కారణం—తండ్రి చూపించిన ఆశ కాదు...

జగత్తులో ధర్మం అంటూ ఒకటున్నది. ప్రేమా నందం తండ్రి. గోపి—ఇంకా రెక్కలైనా రాని కొడుకు. కుటుంబంలో ప్రతి వ్యక్తికీ కొన్ని బాధ్యతలూ, హక్కులూ వున్నాయి. తండ్రి పోషిస్తాడు; కొడుకు పోషింపబడుతాడు. అడిగే హక్కు కొడుకుది; ఇచ్చే బాధ్యత తండ్రిది. ఇదీ—ధర్మం!

కాని, ఇక్కడ ధర్మం తల్లక్రిందులైంది. గోపీ తండ్రిని అణా అడిగాడు. అతడు వాడి ముచ్చట తీర్చలేకపోయాడు. పోనీ—అంతటితో ఊరుకుంటే ధర్మానికి హాని కలిగేది కాదు; సంసారంలో లోటుపాట్లు సహజమే!...కాని—ప్రేమానందం తన అవసరాన్ని తీర్చుకోడానికి కొడుకును వినియోగించుకున్నాడు.

గోపీకి భాష అందుబాటులో లేకపోవచ్చు. భావానికి మాత్రం వాడు దగ్గరవాడే! తనస్థానం చాలా స్వల్ప మైనది. కాని, తను తన స్థానాన్ని కూడా అధిగమించాడు. తనది కానటువంటి ఒక పెద్ద బాధ్యతను తను సునాయాసంగా నిర్వర్తించ గలిగాడు. అందుకే వాడిలో ఆ సంతృప్తీ, సంతోషమూ, సగర్వమూనూ!...

...గోపీ తన తండ్రికేసి చూశాడు. వాడి కళ్ళకు ప్రేమానందం ఒక బుల్లిపాపాయిలా కనిపించాడు. *